క్లుప్తంగా

మంత్రి ధర్మానను కలిసిన మహిళా విభాగం సభ్యులు



మంత్రి ధర్మానతో మహిళా విభాగం సభ్యులు

శ్రీకాకుళం రూరల్: రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి ధర్మాన ప్రసాదరావును పెదపాడులోని క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం సభ్యులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థిగా మరోసారి ధర్మాన ఎంపిక కావడంతో ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ధర్మాన విజయం కోసం మహిళా విభాగం సభ్యులంతా చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు. మంత్రిని కలిసిన వారిలో సుగుణరెడ్డి, టి.కామేశ్వరి, గుంట జ్యోతి, గాయత్రి ఉన్నారు.

పోషకాహారంతో మెరుగైన ఆహారం



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న పీడీ శాంతిశ్రీ

శ్రీకాకుళం అర్బన్: చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పోషకాహాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శాంతిశ్రీ అన్నారు. శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు కృష్ణాపార్కు సెక్టారు పరిధిలోని దూడివారిసందు, తుమ్మావీధి అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం సందర్శించారు. సరుకుల పంపిణీకి సంబంధించి రికార్డులను పరిశీలించారు. అనంతరం పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా పోషకాహార విలువలతో కూడిన ఆహార పదార్థాలను తీసుకోవాలని గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. సీడీపీవో శోభారాణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పి.సీతామహలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆదిలక్ష్మి, సంధ్యారాణి, రోజా, గ్యానమ్మ ఉన్నారు.

అయ్యప్పస్వామికి పూజలు



పూజలందుకున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం సందర్భంగా స్వామికి క్షీరాభిషేకాలు జరిగాయి. అర్చకులు దేవరకొండ శంకరనారాయణశర్మ ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రెడ్డి చిరంజీవులు, రాజారావు పాల్గొన్నారు.

వైభవంగా ఉమారామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం



అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

గార: శిమ్మపేటని ఉమారామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవం బుధవారం సాయంత్రం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయ పూజారులు పెద్దపాటి ఈశ్వరరావు, మూర్కాళ్ల శంకరరావు, పెద్దపాటి దినేష్‌ల ఆధ్వర్యంలో గ్రామ పురోహితులు దార్లపూడి కామేశ్వరశర్మలు శాస్త్రోక్తంగా పందిరాట వేసే ప్రక్రియను చేపట్టారు. మధ్యాహ్నం మూడు వేల మందికి అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. సాయంత్రం అంబటివానిపేట, శిమ్మపేట గ్రామాల్లో భజన, మంగళవాయిద్యాలు నడుమ తిరువీధి ఉత్సవం కనులపండువగా నిర్వహించారు. రాత్రికి ఆలయ ప్రాంగణంలో శివపార్వతుల కల్యాణోత్సవం ఆరవెల్లి బాలభాస్కర శర్మచే వైదికంగా నిర్వహించగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఎచ్చెర్ల: లావేరు మండలం బొంతుపేట గ్రామంలో షిర్డీ సాయిబాబా ఆలయ ఐదో వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. సామూహిక సాయి వ్రతాలు, చందనోత్సవం, ఊరేగింపు నిర్వహించారు. బాబా పేరిట అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబాను దర్శించుకున్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమం, అభివృద్ధి

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్
- తమ్మినాయుడుపేటలో ఎన్నికల ప్రచారం



ఎచ్చెర్ల క్యాంపస్: మహిళకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. తమ్మినాయుడుపేటలో బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. పంచాయతీ పరిధిలోని బెండివానిపేట, జలిపినాయుడుపేట, సనపలవానిపేటల్లో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఐదేళ్లలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గ్రామ సచివాలయ వ్యవస్థ, గ్రామ వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేనట్లు తెలిపారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి ప్రజలను ఓట్లు అడుగుతున్నట్లు తెలిపారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ముఖ్యమంత్రిగా అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు టొంపాల సీతారాం, నాయకులు పిన్నింటి సాయికుమార్, సనపల నారాయణరావు, సనపల సూరిబాబు, చిల్లా వెంకటరెడ్డి, మీసాల వెంకటరమణ, వావిలపల్లి సుధ, బోర గోవింద, సీరపు శ్రీరామ్మూర్తి, కొత్తకోట సూర్యారావు, పంచాది నర్సింహమూర్తి, వావిలపల్లి రామారావు, లక్ష్మీనారాయణ, గురుగుబెల్లి ।

అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని అదపాక గ్రామంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సతీమణి, మాజీ ఎంపీపీ గొర్లె పరిమళ బుధవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని, ఎచ్చెర్ల ఎమ్మెల్యేగా గొర్లె కిరణ్‌కుమార్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతంనాయుడు, పార్టీ మండల అధ్యక్షులు దన్నాన రాజీన్నాయుడు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గొర్లె అప్పలనాయుడు, నాలుగు మండలాలకు చెందిన మహిళా నాయకులు, వైస్ ఎంపీపీలు, పీఏసీఎస్ చైర్మన్‌లు పాల్గొన్నారు.

వేడుకగా దత్తాత్రేయ స్వామి దేవస్థాన ప్రతిష్ట



పూర్ణాహుతి కార్యక్రమంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు



స్వామిని దర్శించుకుంటున్న పేరాడ తిలక్, పిరియా సాయిరాజ్

గార: మండల కేంద్రం సమీపంలోని ఆరంగిపేటలో మూడు రోజులుగా జరుగుతున్న అనఘాదేవి సమేత దత్తాత్రేయస్వామి దేవస్థానం ప్రతిష్టా మహోత్సవం కనులపండువగా జరిగింది. వైదికులు ఆరవెల్లి బాలభాస్కరశర్మ, గ్రామ పురోహితులు కొండబాబు ఆధ్వర్యంలో అర్చకుల బృందం ఉదయం నుంచి పలు వైదిక కార్యక్రమంలో భాగంగా యంత్ర, విగ్రహ ప్రతిష్టలు, దర్పణ దర్శనం, పూర్ణాహుతి నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో మంత్రి ధర్మాన ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి పేరాడ తిలక్, ఇచ్ఛాపురం మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎంపీపీ గొండు రఘురామ్, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పీస గోపి, సర్పంచ్ మార్పు పృథ్వీరాజ్, ముంజేటి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి పండగ

ఎచ్చెర్ల క్యాంపస్: చినకొంగరాం గ్రామంలో మంగళ, బుధవారాల్లో అసిరితల్లి అమ్మవారి పండగలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు ఆహ్వానం మేరకు ప్రత్యేక పూజల్లో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. బంధు, మిత్రులతో గ్రామంలో సందండి నెలకొంది.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు



పెంట గ్రామ సచివాలయం సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ వెంకన్నబాబు

జి.సిగడాం: ఎన్నికల కోడ్‌ను ఉల్లంగిస్తు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ వెంకన్నబాబు అన్నారు. మండలంలోని సీతంపేట, పెంట, జి.సిగడాం గ్రామ సచివాలయాలను బుధవారం తనిఖీ చేసి ఎన్నికల కోడ్‌పై సచివాలయం సిబ్బందికి అవగాహన కల్పించారు. జిల్లా ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు ఎక్కడైనా ఉంటే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. సచివాయలం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

రహదారి ప్రమాదాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ అవతార

శ్రీకాకుళం క్రైమ్: రహదారి ప్రమాదాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ సీఐ ఎం.అవతారం అన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో 70 శాతం వరకు హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులే ఉంటున్నారన్నారు. నగరంలోని మెడికవర్ ఆస్పత్రి వైద్యులు ట్రామా అవేర్‌నెస్‌పై బుధవారం నిర్వహిచిన సదస్సుకు సీఐ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రమాదాలకు గురయ్యే క్షతగాత్రులను తక్షణమే ఆస్పత్రికి చేర్పించే వారికి కేంద్ర ప్రభుత్వం ద్వారా రహదారి భద్రతా అధికారులు గుడ్ సమారిథాన్ పథకం నుంచి రూ. 5 వేలు నోడల్ అధికారిగా ఉండే జిల్లా కలెక్టర్ ద్వారా అందజేస్తారన్నారు. నగర పరిధిలో సైతం కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. సదస్సులో సెంటర్ హెడ్ డాక్టర్ సీహెచ్ సాగరిక, ఎమర్జెన్సీ మెడికల్ హెడ్ డాక్టర్ బాల సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న పద్మజ

కాశీబుగ్గ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కోర్సులో శిక్షణ పొందిన 152 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో కాశీబుగ్గ సూర్యతేజ డిగ్రీ కళాశాలలో ఫిబ్రవరి ఐదు నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన ఆప్టిట్యూడ్ తరగతులకు 152 మంది శిక్షణ పొందారు. వీరంతా ఫైనల్ పరీక్షలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ పాలకమండలి సభ్యురాలు దానేటి పద్మజ చేతుల మీదుగా కోర్సు సర్టిఫికెట్లను విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ కో–ఆర్డినేటర్ ఎస్.వెంకటరమణ, ఉన్నతి ఫౌండేషన్ ఎన్‌జీవో తామాడ కిరణ్ ఉన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



రణస్థలం: పాతర్లపల్లి రహదారిలో తనిఖీలు చేస్తున్న ఫ్లైయింగ్ స్కాడ్



రణస్థలం: ద్విచక్ర వాహనదారుడి బ్యాగ్‌ను తనిఖీ చేస్తున్న ఫ్లైయింగ్ స్కాడ్

రణస్థలం: రానున్న సారవత్రిక ఎన్నికల నేపథ్యంలో ఫ్లైయింగ్ స్కాడ్ సిబ్బంది బుధవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. మండలంలోని రణస్థలం, పాతర్లపల్లి, కోష్ట, పైడిభీమవరం వంటి ప్రాంతాల్లో వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సరైన పత్రాలు లేకుండా ఎటువంటి వస్తువులు, మద్యం వంటివి రవాణా చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. ఏఆర్ ఎస్సై కృష్ణారావు, డీటీ ఎస్.నిర్మల, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో విస్తృత తనిఖీలు




రణస్థలం: దేరసాంలో తనిఖీలు చేస్తున్న ఎంపీడీఓ రమణమూర్తి

రణస్థలం: గ్రామాల్లోని రాజకీయ ప్రచార చిత్రాలు, పోస్టర్లు తొలగించాలని ఎంపీడీఓ ఆర్.వి రమణమూర్తి అన్నారు. మండలంలోని పాతర్లపల్లి, మరువాడ, సీహెచ్ రాజాం, దేరసాం గ్రామాల్లో బుధవారం విస్తృతంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో అతికించిన పోస్టర్లను తొలగించారు. ఎంపీడీఓ అసిస్టెంట్ పి.సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

• ఎండ నుంచి ఉపశమనం..









తీవ్రమైన ఎండలతో అల్లాడుతున్న జనానికి బుధవారం కురిసిన వర్షం ఉపశమనాన్ని ఇచ్చింది. తెల్లవారు జాము నుంచే మోస్తరు వర్షం కురిసింది. వానతోపాటు భారీగా ఉరుములు, గాలులు వీయడంతో జనం భయానికి గురయ్యారు. కాగా రోజంతా ఆకాశం మేఘావృతం కావడంతో శ్రీకాకుళం నగరం చల్లబడింది. వర్షంలో తడుస్తూనే కొంతమంది తమ పనులను పూర్తి చేసుకున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ఎచ్చెర్ల క్యాంపస్: దోమాం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్సై చిరంజీవి



జి.సిగడాం: పోలింగ్ కేంద్రాలపై ఆరా తీస్తున్న ఉమామహేశ్వరరావు



అరసవల్లి నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ సన్యాసినాయుడు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని ఎస్ఎంపురంపేట, కొత్తపేట, దోమాం, అభింఖాన్‌పేట గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎస్సై చిరంజీవి బుధవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సంఖ్య, గతంతో ఎన్నికల నిర్వహణలో ఎదుర్కొన్న సమస్యలు, ఏర్పాట్లు పరిశీలించారు. మండలంలో 90 పోలింగ్ కేంద్రాలను పరిశీలించనున్నట్లు ఎస్సై చెప్పారు. గత ఎన్నికల్లో చోటుచేసుకున్న సంఘటనలు, ప్రస్తుతం గ్రామాల్లో నెలకొన్న పరిస్థితుల ఆధారంగా శాంతిభద్రతలు కల్పిస్తామన్నారు.

మౌలిక సదుపాయాలపై దృష్టి..

జి.సిగడాం: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై బీఎల్‌ఓలు, వీఆర్‌ఓలు దృష్టి సారించాలని మండల ఎన్నికల రిట్నరింగ్ అధికారి ఆర్.ఉమామహేశ్వరరావు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఎన్నికల సమయంలో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, రవాణా సౌకర్యాలను పరిశీలించాలన్నారు. గ్రామాల్లో ఎన్నికల నియమావళిపై ప్రత్యేక నిఘా వేయాలని సూచించారు. గ్రామ స్థాయి సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలన్నారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం క్రైమ్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శ్రీకాకుళం రూరల్ సీఐ లెంక సన్యాసినాయుడు బుధవారం నగరంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్న జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు ఇలిసిపురం, ఆదిత్యనగర్, అరసవిల్లి, ఖాజీపేట పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, భౌగోళిక పరిస్థితులు, ఓటర్లు వచ్చి వెళ్లే ప్రదేశం, బయటకు పోయే మార్గాలపై ఆరా తీశారు.


• కొచ్చెర్లలో ఫ్లాగ్ మార్చ్



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు

రణస్థలం: సార్వత్రిక ఎన్నికల్లో నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జే.ఆర్.పురం ఎస్సై కె.గోవిందరావు అన్నారు. మండలంలోని కొచ్చెర్ల గ్రామంలో కేంద్ర రక్షణ బలగాలు, సివిల్ పోలీసులు బుధవారం ప్రజా చైతన్యం కల్పిస్తూ పోలీస్ కవాతు నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా, ఎన్నికల విధులకు ఆటంకం కల్పించినా క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు.

• కనుగులవానిపేటలో...



ఫ్లాగ్‌మార్చ్‌లో కేంద్ర బలగాలు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని కనుగులవానిపేట గ్రామంలో కేంద్ర బలగాలు బుధవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. శ్రీకాకుళం రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో ఈ మార్చ్ సాగింది. ప్రశాంత ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీసులు కోరారు.

చదువుపై దృష్టి పెట్టాలి



ఎస్ఎంపురం విద్యార్థులతో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని జాతీయ సేవా పథకం వలంటీర్లు సూచించారు. శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఎస్ఎంపురం క్యాంపస్) విద్యార్థుల ప్రత్యేక జాతీయ సేవా పథకం శిబిరం కొనసాగుతుంది. నాలుగో రోజులో భాగంగా ఎచ్చెర్ల, ఎస్ఎంపురం ప్రభుత్వ పాఠశాలలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్య ప్రాధాన్యత, భవిష్యత్తు, యోగా, ఏకాగ్రత, ధ్యానంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఫోన్లు, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. విద్య అవసరం మేరకు మాత్రమే స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్‌లు వినియోగించాలని సూచించారు. ధ్యానం, యోగా దిన చర్యగా మార్చుకోవాలన్నారు. పీఓలు వి.సింహాచలం, జి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

పిచ్చుకలను సంరక్షించండి



పిచ్చుక బొమ్మలు చూపుతున్న విద్యార్థులు

నందిగాం: వాతావరణ సమతుల్యతను కాపాడి పర్యావరణానికి మేలు చేసే పిచ్చుకలతోపాటు ఇతర పక్షులను కాపాడాలని పెద్ద తామరాలపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం గున్నయ్య పిలుపునిచ్చారు. బుధవారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా పాఠశాలలో సేవ్ స్పారో కార్యక్రమం నిర్వహించారు. పక్షులు చేస్తున్న మేలు, వాతావరణ సమతుల్యతలో పిచ్చుకల పాత్రను విద్యార్థులకు వివరించారు. అంతకుముందు విద్యార్థులతో పిచ్చుకల డ్రాయింగ్ వేయించారు. ఉపాధ్యాయుడు బాలక శంకరరావు పాల్గొన్నారు.

వేతనం పెరిగేలా పనుల కల్పన

- డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు

టెక్కలి: ఉపాధి హామీ పథకం ద్వారా పనుల్లో పాల్గొనే వేతనదారులకు సరాసరి వేతనం పెరిగే విధంగా వారికి పనులు కల్పించాలని డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు సిబ్బందికి సూచించారు. కోటబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్‌లతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హత కలిగిన ప్రతీ కుటుంబానికి వంద రోజులు పని కల్పించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. అలాగే 2024–25 సంవత్సరానికి సంబంధించి పనులు గుర్తించి వేతనదారులకు పని కల్పించాలన్నారు.